మోనా అంటే ఆమెకు అసహ్యం. అంత అసహ్యమూ వొక్కసంఘటనతో, ప్రేమగా మారి పోయింది. ఏమిటా సంఘటన ?

# మోనా

వి. వి. సూర్యనారాయణ



"భౌ... భౌ భౌ....భౌ...."

"మోనా ! నోర్ముయ్ ! ఛీ, దిక్కుమాలిన కుక్క ! ఒక్క క్షణమైనా ప్రశాంతంగా వుండనివ్వదు" ప్రమీల మంచంమీదనుండే కేకేసింది.

మోనా మొరగటం మానలేదు. పైగా యింకా జోరుగా గొంతెత్తింది– నీ లక్ష్యం నాకేవిటన్నట్లుగా ! గొలుసు లాగుతూ మరీ అరుస్తోంది.

సీరియస్‌గా ఏదో రచయిత్రి సీరియల్ చదువుకుంటున్న ప్రమీల మరో రెండుసార్లు కేకలేసింది

మోనా అరవటం మానలేదు.

కోపంతో పుస్తకాన్ని గిరాటు వేసి లేచింది ప్రమీల. చీపురుకట్ట పట్టుకుని మోనా దగ్గరకెళ్ళింది.

"షటప్ ! డర్టీక్రీచర్ ....చంపేస్తాను" అంది భద్రకాళిలా.

"భౌ భౌ.... ఊఁ.... భౌ భౌ...."

మోనా ప్రమీలమీదికి ఉరకబోయింది. కట్టిన గొలుసును తెంపటానికి ప్రయత్నిస్తూ.

ప్రమీల రెచ్చిపోయింది. "ఎంత ధైర్యమే నీకు ! నన్నే ఎదిరిస్తావా. రాస్కెల్" అంటూ చీపురు తిరగేసి బాదటం మొదలెట్టింది. అది అరుస్తూ మరింత కోపంతో రెండు కాళ్ళ మీద లేచి ప్రమీలను అందుకోవటానికి ప్రయత్నిస్తోంది.

ప్రమీల చేతులు నొప్పెట్టేటట్లు కొడుతోంది.

ఉన్నట్లుండి ప్రమీల చేతిని ఎవరో పట్టుకున్నారు. ప్రమీల చూసింది. భర్త నవ్వుతూ చీపురు లాగేసి ప్రక్కన పడేశాడు.

"ఏవిటిది ప్రమీ. నోరులేనిదాన్నలా బాదేస్తున్నావు" అన్నాడు.

"నోరు లేనిదా! నా చెవులు చూడండి ఎలా చిల్లులు పడిపోయాయో ! రాకాసిలా యిదీ దీని నోరున్నూ....దీన్ని వెంటనే యెక్కడికన్నా పంపించెయ్యండి –

"ఉహుఁ."

"అయితే నన్ను పంపించెయ్యండి."

"ఉహుఁ."

"వీల్లేదు. నాకు కుక్కలంటే అసహ్యం. మీకూ అప్పారావుగాడికి అదంటే ప్రేముండొచ్చు నాకు లేదు. రాదు. కుక్కను పంపించేస్తారాలేదా ?"

"నిన్నదేం చేసింది ?"

"నా మాటలు వినదు. పైగా మీదికి ఉరుకుతుంది. ఎప్పుడూ అరుస్తుంది. ప్రశాంతంగా వుండనివ్వదు. ఇంకేం కావాలి

"పిచ్చి పిచ్చిగా ఆలోచిసున్నావుగానీ ఒకటిచెప్పు.... నువ్వెప్పుడన్నా దాన్ని ప్రేమతో పిలిచేవా ? కుళాయిదగ్గర ఆడాళ్ళలా దానిమీదికి ఉరుకుతావు. నువ్వు కాప

విరాకు ఆనందానిచ్చే
మంచి పుస్తకాలు

1. కుటీర పరిశ్రమలు రు. 7-00
2. స్వప్నాల డిక్షనరీ " 7-00
(గూఢ అర్థాలతో సహా)
3. దాంపత్య రహస్యాలు " 8-00
4 కామ సూత్రాలు " 8-00
5. గర్భ నిరోధ మార్గాలు " 8-00
(చిత్రపటములతో సహా)

పైవాటిలో 4 పుస్తకాలుకి ఆర్డరు పంపిన వారికి వి. పి. పోస్టు ఖర్చు ఉచితం. అంత కన్నా తక్కువ ఆర్డరుకి పోస్టేజి అదనం.

ఉషా బుక్ సెంటర్,
గాంధీనగరం,
తాడేపల్లి గూడెం-1.

ఉచితం ఉచితం ఉచితం
తెల్ల మచ్చలు
ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండి పోవును ప్రచారం కొరకు 1 సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి Address
GAUTAM CHIKITSALAYA
(S-DD)
(P.O.) KATRI SARAI (GAYA)

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!

హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవసర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు, పోస్టు ద్వారా కూడా వైద్యంచేయబడును.
వరిబీజము(బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండ. రండి.
డా॥ దేవర, ఫోన్ 551,
మార్వాడి గుడివద్ద, తెనాలి.
బ్రాంచి : 5/1, బ్రాడిపేట, గుంటూరు-2

రానికొచ్చి మూడు నెలలయ్యింది ఇదొచ్చి మూడేళ్ళయ్యింది అప్పారావు దాన్ని చిన్నప్పటి నుండి సాకేడు. స్నానం చేయిస్తాడు. దువ్వుతాడు. అన్నం పెడతాడు, ఆడిస్తాడు. అందుకని వాడిమాట వింటుంది నువ్వూ దానితో చెలిమిచేస్తే నీ మాటా వింటుంది. కుక్కనైనా, మనిషినైనా, చివరికి మొక్కనైనా ప్రేమతో గెలవాలి గాని నోటితోకాదు. ప్రమీ! నేను క్యాంపులకి వెళ్ళిపోతే ఒంటరిగా ఉండే నీకు ఈ కుక్కే కదా తోడు! కుక్కలు మనుష్యుల్లా అనవసరంగా అరవ్వు. కరవ్వు. ఇందాక నేనొచ్చిన కారు చప్పుడు విని అది అరిచింది. నువ్వు తలుపులు తెరిచి వుంచేశావు. మరి ఏ దొంగైనా వచ్చివుంటే ఏమవున్ను? దాన్నలా కట్టి పడేయకుండా వదలేసే బావుంటుంది...."

"అవును! నానెత్తిమీద కూచుంటుంది"

"తప్పేవిటి? పెళ్ళయ్యాక నువ్వు నా నెత్తిమీద కూర్చున్నావుగా.... అలాగే!"

"చాల్లెండి"

ప్రమిల కిటికీలోంచి బయటకు చూపింది. ఆ దృశ్యం కనపడగానే మళ్ళీ కోపంతో ఆమె కళ్ళు జేవురించేయి.

"చూడండి అప్పారావు ఒడిలో అదెలా పవళించిందో! వాడితో ఆ ఆటలు చూడండి" అంది అక్కసుగా.

కృష్ణ చూశాడు.

అప్పారావు దాని నోటిలో చెయ్యి పెడుతున్నాడు. అది కొరకడానికి ప్రయత్నిస్తోంది. దాన్ని దువ్వుతున్నాడు. ముద్దు పెటుకుంటున్నాడు అది లెమ్మనగానే లేస్తోంది నడవమంటే రెండుకాళ్ళతో నడుస్తోంది. అప్పారావు ముఖాన్ని నాలుకతో నాకేస్తోంది

"ఛీ పాడు." అంది ప్రమీల.

"ఏవిటోయ్ పాడు.... అదే ఎఫెక్షన్! నువ్వు అప్పుడప్పుడు దయతో చెయ్యవూ. అలాగే...."


"కొడతాను అలా మాట్లాడితే"

"తప్పు. తంతాను అనాలి- నా పేరు కృష్ణకదా మరి.... కానియ్...."

"మీతో మాట్లాడలేను బాబూ వదండి ఆకలి వేస్తోంది" భర్త చెయ్యి పట్టుకుని డైనింగ్ రూంకేసి లాక్కెళ్ళింది ప్రమీల.

* * *

మోనా చెయ్యెత్తు ఆల్సేషియన్. నల్లని రంగు. భయంకరంగావుంటుంది. అదంటే ఆ చుట్టుపట్ల అందరికీ భయం. కొత్త వాళ్ళెవరూ ఆ పరిసరాలికి రారు. అప్పారావుగాని. కృష్ణగాని చెపితే అది అక్షరాలా పాటిస్తుంది. ప్రమీలమాట వినదు.




ప్రమీలకు చిన్నప్పటినుండీ కుక్కలంటే కోపం. అసహ్యం. కాపురానికి వచ్చింది మొదలు దాన్ని వదిలించుకోవాలని శాయశక్తులా ప్రయత్నించింది. ఆ ప్రయత్నం ఫలించలేదు! పైగా మోనా మరింత దూరమయ్యింది. ఈ ఒక్క విషయంలో భర్త తనమాట వినకపోవడం ఆమెకు కొంచెం కష్టంగాఉన్నా భర్త ప్రేమానురాగాల ముందు ఏమీ చెయ్యలేక నిస్సహాయంగా ఉండిపోయింది.

కృష్ణ ఇంటిలో ఉన్నంతవరకూ అతని కాళ్ళదగ్గరే కూర్చుంటుంది మోనా. బెడ్ రూంలో కూడా మంచంప్రక్కనే పడుకుంటుంది. "ఛీ ఏవిటిది మనమధ్య" అంటుంది ప్రమిల. "ఫరవాలేదు. అది ఎవరితోనూ చెప్పదులే" అని భార్యను దగ్గరికి తీసుకుంటాడు కృష్ణ!

* * *

మర్నాడు కృష్ణ ఆఫీసుకు వెళ్ళిపోయేడు.

అప్పారావు బజారు కెళ్ళేడు.

మోనా ఆకలి అన్నట్లుగా సన్నగా మొరుగుతోంది

ప్రమిల చూసింది. దానికి అన్నం వేళ అయినట్లుంది. భర్త చెప్పింది గుర్తొచ్చింది. "చూస్తాను" అనుకుని అన్నం ప్లేటులో పెటి తీసుకెళ్ళింది.

ప్రమీలను చూడగానే లేచి నించుని మొరిగింది మోనా.

"ఇడియట్. అన్నం తెస్తే అరుస్తావేం! ఇదిగో తిను" అని ఒక నెట్టు నెట్టింది ప్లేటుని.

మోనా వొకసారి వాసనచూసికూర్చుండి పోయింది తినకుండా.

"తిను.... తినవేం గాడిదా" అంది ప్రమీల కోపంగా.

మోనా గుర్రుపెట్టింది.

"అరె! నీకేదో మూడింది. ఈ ప్రేమ అక్కర్లేదన్నమాట. ఉండు చూపిస్తాను" అంటూ పక్కనే ఉన్న కర్ర పట్టుకుంది.

అదిచూసి మోనా కోపంతో గొలుసును లాగింది జోరుగా.

"తిను. తినకపోయేవో చంపేస్తాను ఈ వేళ. చంపయినా సరే అన్నం కూరుతాను నీ నోట్లో."

మోనా దూకబోయింది.

ప్రమీల కర్రతో ఎడాపెడా కొట్టింది. అది కోపంతోను, బాధతోను మరింత రెచ్చిపోతోంది.

"అమ్మగారూ, ఏవిటండీ! ఊరుకోండి" అంటూ వచ్చేడు అప్పారావు.

"చూడు. దరిద్రపు మొహం! అన్నం పెడితే నా మీదికి ఉరుకుతోంది. మీ అయ్యగారేమో దీనిమీద ప్రేమ ఒలికబోయమంటారు"

"మీ రెళ్ళండమ్మా. నేను చూస్తాను."

ప్రమీల కర్ర దానిమీద విసిరేసి విసవిసా వెళ్ళిపోయింది. గదిలోకి వెళ్ళి వుండబట్టలేక మళ్ళీ బయటకు వచ్చి చూసింది.

అప్పారావు అన్నం కలిపి మోనా దగ్గర ప్లేటు పెట్టేడు. అది తోకాడిస్తూ ఆవురావురుమని తింటోంది. అప్పారావు దాన్ని దువ్వుతున్నాడు. మధ్యమధ్య అప్పారావుని చూస్తూ అది తృప్తిగా తింటోంది.

"హుఁ! ఒక పనివాడికున్న విలువ కూడా నాకులేదు. ఈ దరిద్రపు కుక్క దృష్టిలో. ఇడియట్స్" అని ఇద్దరినీ తిట్టుకుని, వెళ్ళి ఫోమ్ బెడ్‌మీద ధబేల్మని పడిపోయింది ప్రమీల.

* * *

సాయంత్రం పాలు గిన్నెలో పోసి మోనా ముందుంచింది ప్రమీల. అది కళ్లు మిటకరిస్తోంది.

"తాగు" అంది ప్రమీల.

అది తాగలేదు. వాసనచూసి కాళ్ళతో గిన్నెను తిరగదోసింది!

ప్రమీలకు విపరీతమైన కోపం వచ్చింది. కానీ అది చూపించలేక పోయింది. మోనాను కట్టెయ్యలేదు. కట్టి వుంటే దాన్ని చంపేసివున్ను!

"ఛీ" అనుకుని వెనక్కి తిరిగిన ప్రమీలకు తోటలోకి ఆవు రావటం కనిపించింది." మోనా! వెళ్ళు .. ఆవొచ్చింది" అంది.

మోనా కదల్లేదు!

ప్రమీల అప్పారావునిపిల్చి చెప్పింది.

అప్పారావు మోనాకి ఆవుని చూపించి "వెళ్ళు" అన్నాడు. అది ఛెంగున ఒక్కవుదుటున తోటలోకి వెళ్ళి ఆవుని తరిమి తరిమి ఒగుర్చుకుంటూ వచ్చింది.

ప్రమీల ముఖం కందిపోయింది. కోపంతో ముక్కుపుటాలు ఎగిరెగిరి పడుతున్నాయి. తలుపు వేసుకుని పడుకుంది.

కృష్ణ ఆఫీసునుండి వస్తూనే. "అలకపాన్పులా వుందే!" అంటూ పలకరించేడు భార్యని.

ప్రమీల జరిగింది చెప్పింది.

కృష్ణ నవ్వేడు. "ఇలా కోపంతో ఉన్నప్పుడు నీ అప్సరూప సౌందర్యం ఇంతింతై వటుడింతై అన్నట్లుగా...."

"మీకు నాలుగు తగలాలి. నేను చెప్పిందేవిటి.... మీరు అంటున్నదేవిటి? నా బాధ అర్థం చేసుకోరేం?"

"ఏం చెయ్యను?"

"జరిగింది చెప్పేనుగా"

"టేకిట్ ఈజీ స్వీటీ! ఇప్పుడేం చెయ్యమంటావు?"

"కనీసం అప్పారావునన్నా పంపించెయ్యండి."

"వాడు ఇరవైఏళ్ళ నుండీ మనయింట్లో పని చేస్తున్నాడు. వాడికి నేనంటే చిన్నప్పటి నుండీ అభిమానం. అందుకే




శుభవార్త

నాడీ ప్రవీణ, దీర్ఘరోగ నిపుణులు

డా॥ ఎన్. ఎస్. రావు, M. B. H. R. M. P.

గారిని సంప్రదించండి.

రావూస్ ప్రోడక్ట్సు & క్లినిక్,

ప్లాట్ నెం. 471, జూబ్లిహిల్సు కో-ఆపరేటివ్ సొసైటీ బిల్డింగ్సు, బంజారాహిల్సు ఎక్స్‌టెన్షన్,

హైదరాబాద్-500 034 (నాంపల్లి నుండి బస్సు రూట్ '9V')

శరీర బలహీనత, పొట్టిగా పెరుగుటగాని, చిన్నప్పటినుండి ఏ మందువలన లావుకాకపోవుట, అంగములు వుండవలసిన సైజులో వుండకపోవుట, నరముల బలహీనత, మానసిక వ్యాధులు, ఫిట్సు, భయం, గుండెదడ, రక్తప్రసరణ ఎక్కువగావడం లేక తక్కువ గావడం, సర్వవిధములగు దగ్గులు, ఉబ్బసం, పొత్తికడుపు ఎత్తుగాపెరగడం, జలోదరం, కడుపునొప్పి, గ్యాస్టిక్ ట్రబుల్స్, లివర్ జబ్బులు, కడుపులో గాలిచేరుట, స్త్రీల ముట్టుకట్టునొప్పి, కనుమవ్యాధి(ఏ రంగైనాసరే), మూత్రవ్యాధులు, మూలశంక, సుఖవ్యాధులు, స్త్రీలకుగాని, పురుషులకుగాని ఒకరిపై ఒకరికి విముఖత, పిల్లలు లేకపోవుట, వీపునొప్పి, నడుమునొప్పి, కీళ్ళవ్యాధులు, వాపు, నీరుచేరుట, చర్మవ్యాధులు, పుండ్లు, ఎక్కడైనా చర్మము దళసరి ఎక్కుట, బోదవాపు, జ్వరం, పక్షవాతం మొదలైన వ్యాధులు దీర్ఘ వ్యాధులుగా పరిణమించినపుడు మాత్రమే వీరు చికిత్స చేయుదురు. తరుణ వ్యాధులు వీరు తీసుకోరు.

సంప్రదించు కాలం : ఉ. 7 గం నుండి సా. 5 గం. వరకు
పరీక్ష ఫీజు రు. 15/- చికిత్సకు అదనం.

ప్రతినెల క్యాంపులు : 5వ తేదీ కర్నూలు— న్యూ ఉడిపి హోటల్, పెద్ద మార్కెట్ వద్ద; 6వ తేదీ గుంతకల్—శ్రీలాడ్జి; 7వ తేదీ కడప—ద్వారకాలాడ్జి; 8వ తేదీ తిరుపతి—భీమాస్‌అనెక్స్‌లాడ్జి; 9,10 తేదీలు మద్రాస్—కోమలవిలాస్, నెం. 5 ప్రాన్సిస్ జోసఫ్‌స్ట్రీట్ (జి.టి.) హైకోర్టుఎదురుగా; 11వతేదీ నెల్లూరు—హోటల్‌సింహపురి; 12వ తేదీ గుంటూరు—ఉడిపిశ్రీకృష్ణభవన్, స్టేషన్‌రోడ్. 13,14 తేదీలు రాజమండ్రి—శాంతినివాస్(మెయిన్‌రోడ్); 15,16 తేదీలలో వైజాగ్—బృందావన్‌లాడ్జి; డాబాగార్డెన్స్ 17వ తేదీ విజయవాడ—మోడరన్ కేఫ్ లాడ్జి (గాంధీనగర్); 18వ తేదీ ఖమ్మం—మయూర్ కేఫ్ (శేషమహల్‌లాడ్జి); 19వ తేదీ వరంగల్—హోటల్‌నటరాజ. 20వ తేదీనుండి హెడ్డాఫీస్.



నేను స్త్రీగా ఉన్నంతవరకూ ఈ పురుష జగత్తులో నివసించడానికి వెనుకాడను.

—మెర్లిన్ మన్రో

*    *    *

ఈ రోజున మనం తెలివిగలవారమను కుంటాం. కానీ మన తెలివి ఎక్కడ అణిగి వుంటుందో తెలుసా? నిన్న మొన్నటి తెలివిగల వాళ్ళు చేసిన తప్పులు వెదకడంలో.

—జాకబ్

*    *    *

బుద్ధిమంతుడు తన బుద్ధిని పోగొట్టుకోకుంటే మరే వస్తువును పోగొట్టుకొనడు.

—మాంటేన్

*    *    *

చెడ్డ నక్షత్రంలో ఎవరూ పుట్టలేదు- పుట్టరు. మనం ఖగోళాన్ని తప్పుగా అర్థం చేసుకోవడమే "చెడ్డ నక్షత్రం" కల్పనకు కారణం

—దలైలామా

*    *    *

ఈ ప్రపంచంలో రెక్కలుగల రెండవ సుందర వస్తువు గాలిపటం. మొదటిది డబ్బు.

—అజ్ఞాని

*    *    *

ఏ అద్దమూ తన ఎదురుగా నిలబడిన స్త్రీకి "నీవు కురూపివి" అని చెప్పదు.

—ఒక సామెత

*    *    *

ఇతరులు తక్కువవారు అనే భావన కలిగే దాకా ఎక్కువగా ఆలోచించడానికి వెనకాడవద్దు.

—కెప్టెన్ రాబర్ట్ ఫాల్కన్

*    *    *

తన అంతరాత్మను మీరి బయటకి మంచి వాడుగా కన్పించడానికి ప్రయత్నించేవాడు తనను తానే దొంగిలించుకునే దొంగ.

—మాస్తి వెంకటేశ అయ్యంగార్

సేకరణ :

ఎమ్. వి. సుబ్బారావు, మైనంపాడు




ఈ వూరు బదిలీ అవగానే నాతో కూడా వచ్చేశాడు. వాడు నన్నొదిలి వెళ్ళడు."

"అయితే నేనే వెళ్ళిపోతాను."

"నిన్నొదిలి నేనుండలేను. నువ్వెళ్ళిపోతే ఈ మోనాని తీసుకుని, ఒక వేట్ సిక్స్టీనైన్ కొనుక్కుని. ఏదో ఎలక్ట్రిక్ పోల్ క్రింద దొర్లాలి నేను."

ప్రమీల నవ్వేసింది. భర్త గుండెల మీద కొడుతూ "ఛీ! నన్ను నవ్వించేసారు. ఎప్పుడూ మీరింతే" అంటూ వొదిగిపోయింది.

*    *    *

కృష్ణ క్యాంప్ వెళ్ళేడు.

సాయంత్రం ప్రమీల బెడ్ రూంలో బోర్లాపడుకుని ఏదో నవల చదువుకుంటోంది.

రెండు చేతులు ఆమెకళ్ళను మూశాయి.

"అరె! అప్పుడే వచ్చేశారే!" అంటూ ఆ చేతుల్ని పట్టుకుని తృళ్ళిపడింది ప్రమీల.

"ఎవరు?" అంటూ వాటిని తొలగించింది. తొలగించి తిరగబోయేంతలో ఆమె భుజాలను పట్టి లేపి కౌగిట్లోకి లాక్కున్నాయి రెండు బలమైన చేతులు!

"ఛీ! వదులు నన్ను. ఎవరనుకున్నావు" అంటూ పెనుగులాడింది.

"అప్పరస అనుకున్నాను. పొరబాటా?"

"నోర్ముయ్, స్టుపిడ్-వదులు...."

"వదలటానికైతే ఎందుకు పట్టుకుంటాను? తనివితీరా అనుభవిస్తాను. నేను జైలుకి వెళ్ళినా, లేక చచ్చినాసరే!"

"రాస్కెల్- వదులు నన్ను. ఛీ ఛీ.... ఎంత ధైర్యంరా నీకు? అరుస్తాను...."

"మోనా!"

మోనా మరుక్షణం గదిలోకి వచ్చింది.

"మోనా! మీ అమ్మగారిమీద నిల్చో"

మోనా ముందరికాళ్ళు ఎత్తి ప్రమీల ఛాతీమీద పెట్టి నోరుతెరిచి ఆమె కళ్ళల్లోకి చూస్తూ నిల్చింది.

ప్రమీల బిక్కచచ్చిపోయి భయంతో వొణికిపోతూ వుండిపోయింది

"అరిస్తే యిది చీరేస్తుంది. నేను చెప్పినమాట యిది జవదాటదని తెలుసు. అపురూపమైన అందం వృథాగా మట్టిలో కలిసిపోతుంది. మోనా! వెళ్ళు. గది బయట కూర్చో. పిలవగానే రా...."

మోనా వెళ్ళిపోయింది.

ప్రమీలను మీదికి లాక్కున్నాడు అప్పారావు. పమిట మీద చెయ్యి వేయబోయేడు. ఆమె బలంగా తోసింది. తట్టుకుని మళ్ళీ మీదికి దూకి ఆమెను పొదివి పట్టుకుని మంచమ్మీదకి విసిరేశాడు!

"అప్పారావ్! ప్లీజ్.... నన్నేం చెయ్యకు. నీకు ఏంకావాలంటే అదిస్తాను. ఇవిగో తాళం చెవులు. తీసుకో. నీకా

వలసినంత డబ్బు.... బంగారం... నేనెవ్వరికీ చెప్పను. రిపోర్టివ్వను. తీసుకువెళ్ళిపో. నన్నేంచెయ్యకు. అప్పారావ్... ప్లీజ్.... నన్నేం చెయ్యకు...."

ప్రమీల భోరున ఏడుస్తోంది.

"నాకేం ఒద్దు. పచ్చగా ఒంపులు తిరిగిన ఈ ఒళ్ళు చాలు." అప్పారావు మీద పడ్డాడు.

ప్రమీల పెనుగులాడుతోంది.

అప్పారావు ప్రమీల రెండు చేతుల్ని నొక్కి పట్టుకున్నాడు. "ఇదిగో ఒక చేతిని వదిలేస్తున్నాను. దీన్ని మోనా పట్టుకుంటుంది నా కోరిక తీరితే సరి. లేదా ఈ చేతిని మోనా ఫలహారం చేస్తుంది." అని మోనాని కేకేశాడు.

మోనా ఒక్క ఉదుటున వచ్చింది.

ఒక చేతిని మోనా కిచ్చేడు అప్పారావు మోనా నోటితో కరిచి పట్టుకుంది.

ప్రమీల భయంతో కళ్ళు మూసుకుంది. కన్నీళ్ళు ధారగా బుగ్గలమీదనుండి జారి పడుతున్నాయి.

"ఒద్దు అప్పారావ్....నన్నేం చెయ్యకు నన్నొదిలేస్తే నేనంతా మరిచి పోతాను. ప్లీజ్...."

అప్పారావు వినలేదు.

ప్రమీల శక్తినంతా కూడగట్టుకుని ప్రతిఘటిస్తోంది.

క్రమంగా ఆమెలోని శక్తి సన్నగిలుతోంది.

అప్పారావుది పై చెయ్యి అయిపోతోంది.

ఆమెను పూర్తిగా ఆక్రమించుకుంటున్నాడు.

అప్పారావు గట్టిగా నవ్వేడు ఆమె నిస్సహాయతను చూస్తూ.

ప్రమీల కెవ్వున కేకవేసింది.

మరుక్షణం!

అప్పారావు చెయ్యి బలమైన కోరల మధ్య యిరుక్కుపోయింది.

ఈ హఠాత్పరిణామానికి నిర్ఘాంత పోయేడు అప్పారావు. "మోనా! నీకు మతి పోయిందా? వదులు" అని గట్టిగా గుంజి విడిపించుకుని దూరంగా జరిగేడు అప్పారావు.

మోనా నిల్చుని యిద్దరినీ చూస్తోంది.

"వెళ్ళు! ఆవిడ్ని నిలువునా చీరెయ్యి" అన్నాడు అప్పారావు ప్రమీలను చూపిస్తూ.

మోనా ఒక్క క్షణం చూసింది. గుర్రుమంటూ అప్పారావుమీదికి ఉరికింది.

అప్పారావు గది బయటకు పరిగెత్తేడు. మోనా వెంటబడింది.

వీధిలోకి పరిగెత్తేడు. మోనా వదల్లేదు!

* * *

ప్రమీల భోరున ఏడుస్తూ మంచమ్మీద పడిపోయింది. ఎంతటి ఘోరం తప్పింది!

"మోనా! నా మోనా!" ప్రమీల మనసు ఆర్ద్రమయ్యింది.

కాళ్ళ మీద ఎవరో తట్టినట్లయి చప్పున లేచి నించుంది ప్రమీల.

మోనా!

తలనుండి రక్తం కారుతోంది.

ప్రమీల కాళ్ళ దగ్గర కూర్చుండిపోయింది.

"మోనా! ఒక్కసారి నన్ను చూడవూ" అంది ప్రమీల ఏడుస్తూ.

మోనా ప్రమీల కళ్ళల్లోకి చూసింది.

"నీ ఋణం ఎలా తీర్చుకోను మోనా" అంటూ మోనా తలను రెండు చేతుల్లోకి తీసుకోబోయింది ప్రమీల.

ఆమెకా అవకాశం ఇవ్వకుండా మోనా తలను ఆమె పాదాలమీద వాల్చేసింది!

★

ఆస్ప్రో రెట్టింపు వేగంతో బాధ నివారిస్తుంది.
నిజం! రెట్టింపు వేగంగా!




ఎందుకంటే ఆస్ప్రో ఒక్కటే మైక్రొఫైన్డ్ చేయబడింది. Sista's-NIA-506A/77 Tel